నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
08-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు

కోల్‌కత్తా VS లక్నో
కోల్‌కత్తా,
మధ్యాహ్నం:3.30

పంజాబ్ VS చెన్నై
ముల్లాన్‌పూర్,
రాత్రి: 3.30
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఢిల్లీ | 3 | 3 | 0 | 6 |
| గుజరాత్ | 4 | 3 | 1 | 6 |
| ఆర్సీబీ | 4 | 3 | 1 | 6 |
| పంజాబ్ | 3 | 2 | 1 | 4 |
| కొల్‌కత్తా | 4 | 2 | 2 | 4 |
| లక్నో | 4 | 2 | 2 | 4 |
| రాజస్తాన్ | 4 | 2 | 2 | 4 |
| ముంబై | 5 | 1 | 4 | 2 |
| చెన్నై | 4 | 1 | 3 | 2 |
| సన్‌రైజర్స్ | 5 | 1 | 4 | 2 |

ఆరెంజ్ క్యాప్ 201 ఐపీఎల్ అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్ 10 ఐపీఎల్ అత్యధిక వికెట్స్





# దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులకు ఉరిశిక్ష

దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల కేసులో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఐదుగురు నిందితులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. కాగా, 2013 ఫిబ్రవరి 21న దిల్ సుఖ్ నగర్ లో జరిగిన బాంబు పేలుళ్ల ఘటనలో 18 మంది మృతి చెందగా, 130 మందికి గాయాలైన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ ఘటన సంచలన రేపింది. ఉగ్రవాదులు టిఫిన్ బాక్సులో బాంబు పెట్టి పేలుళ్లు సృష్టించారు. ఈ బాంబు పేలుడు కేసులో కీలక సూత్రధారిగా ఇండియన్ ముజాహిద్దీన్ సహ వ్యవస్థాపకుడుగా యాసిన్ భత్కల్ ప్రధాన నిందితుడు. అయితే ప్రస్తుతం హైకోర్టు కింది కోర్టు తీర్పును సమర్పిస్తూ నిందితులకు ఉరిశిక్ష ఖరారు చేసింది. 2013 ఫిబ్రవరి 2న హైదరాబాద్ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ రోజు రాత్రి 7 గంటల సమయంలో దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టాప్ దగ్గర భారీ పేలుడు జరిగింది. ఆ పేలుడు జరిగిన క్షణాల వ్యవధిలోనే కోణార్క్ థియేటర్ సమీపంలోని ఏ-1 మిర్చి సెంటర్ దగ్గర రెండో పేలుడు జరిగింది. ఈ పేలుళ్ల దాటికి మొత్తం 18 మంది మరణించగా..మరో 130 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ పేలుడుపై సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి..దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు కేంద్ర హోంశాఖ ఆదేశాలతో జాతీయ దర్యాప్తు సంస్థ రంగంలోకి దిగింది. దీంతో హైదరాబాద్‌లో నమోదైన ఈ రెండు కేసులు ఎన్ఐఏకి బదిలీ అయ్యాయి.

విచారణలో నేరం అంగీకరించిన నిందితులు:

ఇండియన్ ముజాహుద్దీన్ ఉగ్రవాద సంస్థ ఈ పేలుళ్లకు పాల్పడినట్లు ఎన్ఐఏ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా అహ్మద్ సిద్దిబప్ప జరార్ అలియాస్ యాసిన్ బత్కల్, అబ్దుల్లా అక్తర్ అలియాస్ హద్దిలను 2013లో ఇండో-నేపాల్ బోర్డర్ సమీపంలో అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరం ఒప్పుకున్నారు.వాళ్లించిన సమాచారంతో బిహార్‌కు చెందిన తహసీన్ అక్తర్, పాకిస్థాన్ కు చెందిన జియా ఉర్ రెహమాన్‌లను 2014 మేలో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరితో పాటు పుణేకు చెందిన అజీజ్ షేక్‌ను కూడా ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. నిందితుల విచారణలో పేలుళ్లకు కీలక సూత్రధారి మహ్మద్ రియాజ్ అలియాస్ రియాజ్ భత్కల్‌గా గుర్తించారు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో తలదాచుకున్న భత్కల్‌కోసం రెడ్ కార్నర్ నోటీసు కూడా జారీ చేసింది ఎన్ఐఏ. మరోవైపు ఘటనపై దర్యాప్తు చేసిన ఎన్ఐఏ ఆరుగురు నిందితులపై 3 చార్జిషీట్లు దాఖలు చేసింది. ఉగ్రవాద కార్యకలాపాల వ్యవహారంలో గతంలో నిందితులపై కేసులు ఉన్నట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు రియాజ్ భక్తల్ మినహా మిగిలిన ఐదుగురు నిందితులపై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో 2015లో ట్రయల్ కొనసాగింది. విచాణలో భాగంగా 157 మంది సాక్షులను ఎన్ఐఏ ప్రశ్నించింది. వారి నుంచి సేకరించిన ఆధారాలు ఎన్ఐఏ కోర్టుకు సమర్పించింది. 2016 డిసెంబర్ 13న ఐదుగురు నిందితులను దోషులుగా కోర్టు గుర్తించింది. 2016 డిసెంబర్ 13న ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు దోషులకు జైలు శిక్ష, జరిమానాలతో పాటు ఉరిశిక్ష విధించింది. అయితే ఎన్ఐఏ కోర్టు తీర్పుపై నిందితులు అదే ఏడాది తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి హైకోర్టులో నిందితుల పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. నిందితులంతా ప్రస్తుతం వివిధ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు నిందితులకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.



## అదిదా సర్‌ప్రైజ్ ఫుల్ వీడియో రిలీజ్

వెంకి కుడుముల దర్శకత్వంలో నితిన్ - శ్రీలీల జంటగా నటిస్తున్న సినిమా రాబిన్ హుడ్. మార్చి 28, 2025 న ఈ సినిమా విడుదల అయింది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. అయితే, కొన్ని స్టెప్పుల విషయంలో 'అదిదా సర్‌ప్రైజ్' సాంగ్‌పై విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రత్యేక గీతంలో కేతికా శర్మ సందడి చేసింది. ఈ పాటను కొన్ని మార్పులతో థియేటర్లలో ప్రదర్శించిన టీమ్.. అదే వెర్షన్‌ను ఇప్పుడు విడుదల చేసింది. ఈ పాట ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇక ఈ చిత్రంలో ఆదిపురుష్ నటుడు దేవదత్త నాగే విలన్ రోల్ లో నటించగా రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటించారు. ఇక వీరితో పాటుగా డేవిడ్ వార్నర్ కూడా సాలిడ్ క్యామియోలో కనిపించారు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ సంగీతం అందించగా మైత్రి మోవీబీఏ మేకర్స్ నిర్మాణం వహించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ, ఈ సినిమా విజయాన్ని అందుకోలేకపోయింది.

## పోసానికి నోటీసులు ఇచ్చిన సూళ్లూరుపేట పోలీసులు

సినీ నటుడు పోసాని కృష్ణమురళికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి ఈ నెల 15వ తేదీన విచారణకు హాజరు కావాలని పోలీసులు పోసానికి నోటీసులు జారీ చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం సీఐడీ కార్యాలయంలో సంతకం చేయడానికి పోసాని వచ్చిన సందర్భంలో ఈ నోటీసులు అందించారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై అసభ్య వ్యాఖ్యలు చేసినందుకు పోసానిపై ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 15కి పైగా కేసులు నమోదయ్యాయి. ఈ పరిణామాల మధ్య ఆయన వివిధ జైళ్లలో రిమాండ్ ఖైదీగా కొంత కాలం గడిపారు. గత నెలలో కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.





## హజ్ యాత్ర వేళ సౌదీ అరేబియా సంచలన నిర్ణయం

ఈ ఏడాది హజ్ యాత్ర దగ్గరపడుతుండటంతో సౌదీ అరేబియా.. భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా ఇతర 11 దేశాల పౌరులకు వీసాల జారీని తాత్కాలికంగా నిలిపివేసింది. ఉమ్రా, బిజినెస్, కుటుంబ సందర్శన తదితర కేటగిరీ వీసాలపై ఈ నిషేధం ఉంటుంది. సరైన రిజిస్ట్రేషన్ లేకుండా హజ్ యాత్రకు వస్తున్న వారిని నిలువరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సౌదీ అధికారులు తెలిపారు. గత ఏడాది హజ్ సమయంలో రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల తొక్కిసలాట చోటుచేసుకుంది. గత ఏడాది హజ్ యాత్రలో పాల్గొన్నవారిలో 12 వందలకు పైగా యాత్రికులు వివిధ కారణాలతో మృతి చెందారు. రిజిస్టర్ కాని యాత్రికుల వల్ల హజ్ లో తీవ్రమైన రద్దీ ఏర్పడిందని సౌదీ అధికారులు భావిస్తున్నారు. వీసా నిబంధనలను కూడా మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అయితే దౌత్య, నివాస ఆవాసితులు, హజ్ యాత్ర కోసం ప్రత్యేకంగా నమోదైన యాత్రికులకు ఈ నిషేధం వర్తించదు. మరోవైపు సౌదీలో అక్రమంగా నివసిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపింది అక్కడి ప్రభుత్వం. కేవలం వారం రోజుల వ్యవధిలో ఏకంగా 18,407 మంది అక్రమ వలసదారులను అరెస్టు చేసింది. వీరంతా రెసిడెన్సీ, లేబర్, సరిహద్దు భద్రతా నియమాలను ఉల్లంఘించినట్లు సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసింది. మార్చి 27 నుండి ఏప్రిల్ 2 వరకు పలు ప్రభుత్వ ఏజెన్సీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో వీరిని అదుపులోకి తీసుకున్నారు.


## కండక్టర్ కష్టాన్ని గుర్తించిన రేవంత్ రెడ్డి

**పొడవు కారణంగా ఇబ్బందికర పరిస్థితులు**
**ఆర్టీసీలోనే వేరే విభాగానికి బదిలీ**



ఏడడుగుల పొడవుతో కండక్టర్ అమీన్ అహ్మద్ అన్సారీ పడుతున్న ఇబ్బందులను సర్కార్ గుర్తించింది. సోషల్ మీడియా వేదిక ద్వారా ఆయన కష్టం ప్రభుత్వం దృష్టికి రాగా వెంటనే చర్యలు చేపట్టింది. రోజూ బస్సులో ప్రయాణించే దివ్య అనే ఉద్యోగి ఆయన కష్టం చూసి చలించిపోయి వీడియో తీసి రీల్స్‌లో పెట్టగా వైరల్ అయ్యింది. మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి వెళ్ళింది! రేవంత్ రెడ్డి స్పందించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించగా, ఆయన ఆర్టీసీ ఎండి సజ్జనార్‌తో మాట్లాడారు. అన్సారీని ఆర్టీసీలో వేరే విభాగానికి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. హెడ్ ఆఫీస్‌కు లేదా ఎంజీబీఎస్ బస్టాండ్‌కు మార్చాలని నిర్ణయించారు. ఏడడుగుల అమీన్ అహ్మద్ అన్సారీ హైదరాబాద్ చాంద్రయణ గుట్ట దగ్గరలో వున్న షాహీ నగర్ లో నివాసం ఉంటున్నారు. అన్సారీ తండ్రి హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తూ అనారోగ్యంతో 2021లో చనిపోయారు! కుమారుడు అన్సారీ ఇంటర్ మాత్రమే చదివి ఉండటంతో కారుణ్య నియామకం కింద ప్రభుత్వం ఆర్టీసీలో కండక్టర్ ఉద్యోగం ఇచ్చింది. మెహదిపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్ ఉద్యోగం! ఏడడుగుల పొడవు ఉండటంతో విధులు నిర్వర్తించడం అతనికి సవాలుగా మారింది. సాధారణంగా ఆర్టీసీ టాప్ ఆరు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తు మాత్రమే ఉంటుంది! అంటే 195 సెంటి మీటర్లు! అన్సారీ ఎత్తు 214 సెంటి మీటర్లు! విధుల్లో భాగంగా గంటల తరబడి తల వంచి ప్రయాణించడం అనేక కష్టాలు అనారోగ్య సమస్యలు తెచ్చి పెట్టింది! మెడ నొప్పితో పాటు వెన్ను నొప్పి, నిద్ర లేమితో ఇబ్బందులు పడుతున్నానని, వీక్లీ ఆఫ్ రోజు ఆసుపత్రికే పరిమితం అని అన్సారీ ఆవేదన వ్యక్తం చేశారు. అతని రూట్ లో రోజు ప్రయాణించే వారు కూడా అన్సారీ కి ఆర్టీసీ లోనే మరేదైనా ఉద్యోగం ఇవ్వాలని ఇప్పటికే చాలామంది మెయిల్స్ చేశారు! మొత్తానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్ళింది! డైనమిక్ సిఎం స్పందించారు! వెంటనే అతనికి వేరే విభాగానికి బదిలీ చేయనున్నట్లు ఆర్టీసీ ఎండి సజ్జనార్ తెలిపారు.

## హసన్‌పర్తిలో ఆర్టీసీ బస్సు బోల్తా.. ఆరుగురికి తీవ్రగాయాలు





హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టు రింగురోడ్డు వద్ద ఓ ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, మరో 15 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయకచర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. బస్సు ఒంగోలు నుంచి ఆదిలాబాద్ వెళ్తుండగా మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# సెన్సార్ పనులు ముగించుకున్న జాక్

స్టార్ బోయ్ సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'జాక్' ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు బొమ్మరిల్లి భాస్కర్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమైంది. ఇక ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో ఈ మూవీపై ఆసక్తిని క్రియేట్ చేశాయి. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సినిమాలో కంటెంట్ ప్రేక్షకులను ఖచ్చితంగా ఆకట్టుకునే విధంగా ఉండబోతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ సినిమాతో సిద్ధు మరోసారి ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడం ఖాయమని వారు అంటున్నారు. ఈ మూవీలో అందాల భామ వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమాకు అచు రాజమణి, సామ్ సి.ఎస్, సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీవెంకటేశ్వర సినీ చరిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఏప్రిల్ 10న ఈ మూవీ వరల్డ్‌వైడ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది.




## అట్లీ, అల్లు అర్జున్ ప్రాజెక్ట్

ప్రస్తుతం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న క్రేజీ కాంబినేషన్ ఏదన్నా ఉంది అంటే అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అలాగే కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ కలయికలో సినిమా కోసమే అని చెప్పాలి. ఎన్నో నెలల నుంచి ఈ క్రేజీ కాంబినేషన్ పట్ల సాలిడ్ హైప్ నెలకొనగా నేడు అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా అయితే అధికారిక క్లారిటీ వచ్చేసింది. తమిళ భారీ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ వారు ఊరిస్తూ వస్తున్న అనౌన్సమెంట్ ఇపుడు వచ్చేసింది. అయితే అనుకున్నట్టుగానే మేకర్స్ ఒక సాలిడ్ అనౌన్సమెంట్ వీడియోని తీసుకొచ్చారు. ఇది మాత్రం కంప్లీట్ గా ఎవరూ ఊహించని రీతిలోనే ఉందని చెప్పాలి. మెయిన్ గా ఇంటర్నేషనల్ లెవెల్లో హాలీవుడ్ టెక్నీషియన్స్ తో కలిసి మాట్లాడ్డం అలాగే వారంతా ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ఓ రేంజ్ లో చెబుతుండడం అలాగే అల్లు అర్జున్ పై కూడా మోషన్ క్యాప్చర్ ప్రయోగాలు అన్నీ చూస్తుండడంతో అసలు ఏం ప్లాన్ చేస్తున్నారో అనేది అభిమానుల ఊహకి కూడా అందడం లేదు. మొత్తానికి మాత్రం ఈ సెన్సేషనల్ కలయికలో ఒక ఊహించని ప్రాజెక్ట్ ఇండియన్ సినిమా ముందుకు రాబోతుంది అని చెప్పాల్సిందే.

### ట్రాఫిక్ సిబ్బందిపైకి దూసుకెళ్లిన లారీ..

## కానిస్టేబుల్ మృతి

మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద లారీ బీభత్సం సృష్టించింది. విధుల్లో ఉన్న ముగ్గురు ట్రాఫిక్ కానిస్టేబుళ్లపైకి లారీ దూసుకెళ్లింది. దీంతో ఒకరు మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సింహాచలం, రాజవర్ధన్, విజేందర్ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మెట్రో స్టేషన్ పిల్లర్ నంబర్ 600 వద్ద విధులు నిర్వహిస్తున్నారు. నో ఎంట్రీ వాహనాలను నియంత్రిస్తున్నారు. అదే సమయంలో కూకట్‌పల్లి భరత్ నగర్‌లో బియ్యం బస్తాలను అన్‌లోడ్ చేసిన ఓ లారీ.. మియాపూర్ వైపు అతివేగంగా వచ్చి ట్రాఫిక్ బూత్‌ను ఢీకొట్టింది. దీంతో అది అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై పడింది. హోంగార్డు సింహాచలం తలకు తీవ్రమైన గాయం కాగా, రాజవర్ధన్ కుడి చెయ్యి భుజంలో ఫ్రాక్చర్ అయింది. విజేందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను వైద్యం నిమిత్తం మదీనాగూడలోని ఓ ప్రైవేటు దవాఖానకు హాస్పటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సింహాచలం మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. మిగిలిన ఇద్దరూ గాయాలతో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. లారీ డ్రైవర్‌ను సదాశివపేటకు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. నిర్లక్ష్యం, అతి అతివేగం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. మృతుడు సింహాచలం స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస అని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



### ఫైర్ అయిన

## మళవిక మోహనన్

ఈ మధ్య సీనియర్ హీరోలకి సరైన జోడి దొరకడం లేదు. వారి వయస్సుకి సరిజోడు దొరకక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో కొన్ని సార్లు యంగ్ హీరోయిన్స్‌తో జట్టు కడుతున్నారు. అప్పుడు కొంత నెటిజన్ల ఆగ్రహానికి గురి కావలసి వస్తుంది. ఆ వయస్సులో యంగ్ భామలతో రొమాంటిక్ ఏంటని తిట్టిపోస్తున్నారు. అయితే మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రస్తుతం హృదయపూర్వం చిత్రంలో నటిస్తుండగా, ఇందులో మాళవిక మోహనన్ కథానాయికగా నటిస్తుంది. సత్యన్ అంతికాడ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ పూర్తయినట్లు మాళవిక మోహనన్ తెలియజేస్తూ మాళవిక తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్స్ చేశారు. ''65 ఏళ్ల ముసలాయన.. 30 ఏళ్ల అమ్మాయితో ప్రేమాయణమా? ఈ ముసలి హీరోలు వారి వయసుకు తగిన పాత్రలు కాకుండా ఇలాంటి వాటిపై ఎందుకు ఆసక్తి చూపిస్తారో అని అర్థం వచ్చేలా కామెంట్ చేశాడు. అయితే ఈ కామెంట్‌పై మాళవిక మోహనన్ సీరియస్‌గా రెస్పాండ్ అయింది. సినిమాలో అతను నన్ను ప్రేమిస్తాడు అని నీకెవరైన చెప్పారా, నువ్వే ఏవో కథలు అల్లేసుకొని ఏది పడితే అది మాట్లాడుతున్నావ్.. నువ్వు ఏదో ఊహించుకొని అవతలి వారి నిందిస్తున్నావు అంటూ ఘాటుగానే బదులిచ్చింది మాళవిక. ఆ తర్వాత ఈ కామెంట్స్ డిలీట్ చేసినట్టు అర్ధమవుతుంది.

## పవన్ చిన్న కొడుక్కి అగ్ని ప్రమాదం



టాలీవుడ్ పవర్ స్టార్ అలాగే ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కూడా అయినటువంటి పవన్ కళ్యాణ్ ఇపుడు తన సినిమాల కంటే ప్రభుత్వ కార్య కలాపాల్లో మాత్రమే బిజీగా ఉన్నారు. అయితే పవన్ వారసుడు అకీరానందన్ పుట్టినరోజు నేడు కాగా అభిమానులు అకిరాకి బర్త్ డే విషెస్ చెబుతున్నారు కానీ ఇపుడు మరో షాకింగ్ వార్త పవన్ అభిమానులని ఆందోళనకి గురి చేసింది. పవన్ చిన్న కొడుకు అయినటువంటి మార్క్ శంకర్ పవనోవిచ్ అగ్ని ప్రమాదానికి గురైన షాకింగ్ వార్త ఇపుడు అభిమానులని కలవరపెడుతుంది. అయితే మార్క్ శంకర్ సింగపూర్ లో తన విద్యాభ్యాసాలు కొనసాగిస్తుండగా అక్కడ తన పాఠశాలకు జరిగిన అగ్ని ప్రమాదంలో ఇతర స్కూల్ పిల్లలతో పాటుగా తాను కూడా ఇరుక్కున్నాడట. దీనితో మార్క్ కి చేతులు, కాళ్ళకి గాయాలు అయ్యినట్టుగా నిర్ధారణ అయ్యింది. అంతే కాకుండా తన ఊపిరితిత్తుల్లోకి కూడా పొగ ప్రవేశించడంతో మార్క్ శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందికి లోనయ్యాడు అని ప్రకటన వచ్చింది. అయితే పవన్ ఇపుడు పొలిటికల్ పర్యటన ముగించిన తర్వాత వెంటనే సింగపూర్ పయనం కానున్నారట. ప్రస్తుతం మార్క్ శంకర్ పవనోవిచ్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నాడు.

### తమిళనాడు గవర్నర్‌పై

## సుప్రీంకోర్టు సీరియస్



తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిపై సుప్రీంకోర్టు సీరియస్ అయ్యింది. రాష్ట్ర అసెంబ్లీ పంపిన బిల్లులను తన వద్దే పెట్టుకునే వీటో అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దివాలా, ఆర్ మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి చర్యలు అక్రమం అని పేర్కొన్న కోర్టు.. ఆయన వద్ద పెండింగ్‌లో ఉన్న 10 బిల్లులకు క్లియరెన్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర శాసనసభ నుంచి వచ్చిన బిల్లులకు గవర్నర్ తప్పనిసరిగా అనుమతి ఇవ్వాలని, అయితే బిల్లులో వైరుధ్యం ఉంటే దాన్ని తిరస్కరించాలని కోర్టు పేర్కొన్నది.

# ట్రంప్ దూకుడుకు కళ్లెం పడేనా



అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వానికి వ్యతిరేకంగా అమెరికావ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. మొత్తం 50 రాష్ట్రాల్లోని అనేక ప్రధాన నగరాల్లో ప్రజలు భారీ సంఖ్యలో ఉద్యమించారు. 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో ర్యాలీలు నిర్వహించి, ట్రంప్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతిపక్షానికి ఇది అతిపెద్ద నిరసన ప్రదర్శనగా మారింది.టారిఫ్ పేరుతో ప్రపంచ దేశాలను ట్రంప్ భయపెడుతున్న విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ చర్యల వల్ల అమెరికాకి కూడా భారీ నష్టం వాటిల్లుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం కనిపిస్తోంది. ఇందుకు నిరసనగా పౌరహక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ మద్దతుదారులు, అనుభవజ్ఞులు, ఎన్నికల సంస్కరణ కార్యకర్తలు సహా 150కి పైగా సంస్థల మద్దతుతో మొత్తం 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో ఈ హ్యాండ్స్ ఆఫ్ ర్యాలీలు జరిగాయి. అనేక చోట్ల ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. కాగా నిరసనకారులు శాంతియుత ఆందోళనలు చేపట్టడంతో ఎలాంటి అరెస్ట్లు జరగలేదు.ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు, వలసలు, ఆర్థిక వ్యవస్థ, మానవ హక్కులు వంటి అంశాలపై డొనాల్డ్ ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్క్ ను విమర్శించడానికి నేషనల్ మాల్ అండ్ మిడ్టౌన్ మానహట్టన్ నుంచి బోస్టన్ కామన్, వివిధ రాష్ట్ర క్యాపిటల్స్ వరకు వేలాది మంది నిరసనకారులు అమెరికా అంతటా గుమిగూడారు. సియాటెల్లో నగరంలోని ప్రఖ్యాత స్పేస్ నీడిల్ సమీపంలో నిరసనకారులు "నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడండి" అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు.ట్రంప్ సలహాదారు, టెస్లా, స్పేస్‌ఎక్స్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ కొత్తగా ఏర్పాటైన డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డీఓజీ) చీఫ్గా ప్రభుత్వ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తున్నారు. తన పని పన్ను చెల్లింపుదారులకు కోట్లాది రూపాయలు ఆదా చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కానీ ఆయన చర్యలతో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇది చర్చకు దారితీసింది.నేషనల్ మాల్ ర్యాలీలో హ్యూమన్ రైట్స్ క్యాంపెయిన్ అధ్యక్షుడు కెల్లీ రాబిన్సన్ ఎల్జీబీటీక్యూ కమ్యూనిటీ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. కాంగ్రెస్కు చెందిన పలువురు డెమొక్రటిక్ సభ్యులు కూడా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. "మనం చూస్తున్న దాడులు కేవలం రాజకీయమైనవి కావు - అవి వ్యక్తిగతమైనవి. వారు మా పుస్తకాలను నిషేధించడానికి, హెచ్ఐవి నివారణ నిధులను తగ్గించడానికి, మా వైద్యులు, మా ఉపాధ్యాయులు, మా కుటుంబాలు, మా జీవితాలను నేరపూరితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు," అని కెల్లీ రాబిన్సన్ అన్నారు.లో నిరసనకారులు "ప్రజాస్వామ్యాన్ని నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)", "సామాజిక భద్రత నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)," వంటి బోర్డులను ప్రదర్శించారు.కొలంబస్లోని స్టేట్ హౌస్లో గుమిగూడిన వందలాది మందిలో ఒహాయోలోని డెలావేర్ కౌంటీకి చెందిన 66 ఏళ్ల రిటైర్డ్ రోజర్ బ్రూమ్ కూడా ఉన్నాడు. తాను ఒకప్పుడు రీగన్ రిపబ్లికన్గా గుర్తింపు తెచ్చుకున్నానని, కానీ ఆ తర్వాత ట్రంప్ పట్ల విరక్తి చెందానని చెప్పారు."ఆయన ఈ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇది కేవలం ఫిర్యాదుల పరిపాలన మాత్రమే," అని బ్రూమ్ అన్నారు.న్యూయార్క్ పెయింటర్ షైనా కెస్నర్ (43) మాన్హాటన్ నడిబొడ్డున కవాతు చేస్తున్న ఒక గుంపులో చేరి నిరసన తెలిపారు. "నేను చాలా కోపంగా ఉన్నాను. తెల్లజాతి రేపిస్టుల గుంపు మన దేశాన్ని శాసిస్తోంది. అది సరైనది కాదు," అని అన్నారు.ఫ్లోరిడాలోని జూపిటర్లో జరుగుతున్న సీనియర్ క్లబ్ చాంపియన్షిప్లో డొనాల్డ్ ట్రంప్ పాల్గొనగా పామ్ బీచ్ గార్డెన్స్లో వందలాది మంది నిరసనకారులు గుమిగూడి నిరసనలు తెలిపారు.అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది: అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రత, మెడికేర్ను ఆయన ఎల్లప్పుడూ పరిరక్షిస్తారు. ఇంతలో, డెమొక్రాట్ల వైఖరి అక్రమ విదేశీయులకు సామాజిక భద్రత, మెడికేర్ ప్రయోజనాలను ఇస్తోంది. ఇది ఈ కార్యక్రమాలను దివాళా తీస్తుంది. అమెరికన్ సీనియర్లను అణచివేస్తుంది," అని వైట్ హౌస్ చెప్పుకొచ్చింది. మరో వైపు ట్రంప్ టారిఫ్ల మోతకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి.
ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరోవైపు అమెరికాలోనూ ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని ఆదేశ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరలు విపరీతంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. టారిఫ్ ప్రభావంతో ఇరాన్ కరెన్సీ, ఇరానియన్ రియాల్ , మళ్లీ భారీ పతనాన్ని చవిచూసింది. ఒక అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రియాల్ విలువ 10,43,000కి చేరుకుని చరిత్రలో అత్యంత కనిష్ఠ స్థాయిని తాకింది. ఈ సంక్షోభం నేపథ్యంలో రానున్న రోజుల్లో దీని విలువ ఎంతమేరకు తగ్గుతుందన్నది అనిశ్చితంగా మారింది. టెహ్రాన్‌లోని ఫెర్దౌసీ వీధి, దేశంలో కరెన్సీ మారక కేంద్రంగా ఉన్నప్పటికీ, అనేక మంది వ్యాపారులు నగదు బదిలీ వ్యాపారాన్ని నిలిపివేశారు.రియాల్ పతనం వల్ల ఇరాన్‌లో ద్రవ్యోల్బణం 40% దాటింది. ఆహార ధరలు కొన్ని సందర్భాల్లో 100% వరకు పెరిగాయి. సామాన్య ప్రజలు తమ ఆదాయాన్ని డాలర్లు, బంగారం వంటి సురక్షిత ఆస్తుల్లోకి మార్చడం వల్ల రియాల్‌పై ఒత్తిడి మరింత పెరుగుతోంది.